## క్లుప్తంగా

### వేంకటేశ్వరునికి కూడారై సేవ


ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

మెంటాడ: మండల కేంద్రంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన స్వామికి శుక్రవారం కూడారై సేవ నిర్వహించారు. 108 కలశాలలతో ప్రసాదం ఏర్పాటు చేస్తూ సేవ చేశామని ఆలయ ప్రధానార్చకులు పీసపాటి కృష్ణమాచార్యులు తెలిపారు. భోగీ రోజున గోదాదేవి కల్యాణం చేస్తామన్నారు.

బొబ్బిలి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని సింగారపు వీధిలో ఉన్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి కూడారై సేవ శుక్రవారం నిర్వహించారు. దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆంద్ర ఎస్‌ఐగా గణేష్ కుమార్


బాధ్యతలు స్వీకరిస్తున్న గణేష్ కుమార్

మెంటాడ: ఆంద్ర పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా గణేష్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటానన్నారు. గతంలో ఈయన విజయనగరం జిల్లా కేంద్రంలో రూరల్ ఎస్‌ఐగా పనిచేశారు.

### 20 మద్యంసీసాల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంసీసాలను చూపిస్తున్న పోలీసులు

రేగిడి: మండలంలోని జాడపేటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పలు షాపుల్లో పోలీసులు శుక్రవారం ఆకస్మికదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 మద్యంసీసాలను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

### దుస్తుల వితరణ


మజ్జిరాముడుపేటలో దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట, అప్పాపురం గ్రామంలోని నిరుపేదలకు జీఎంఆర్‌వీఎఫ్ వితరణ చేసిన దుస్తులను సర్పంచ్ కరణం శ్రీనివాసరావు చేతులమీదుగా శుక్రవారం పంచిపెట్టారు. కార్యక్రమంలో జీఎంఆర్‌వీఎఫ్ ప్రతినిధులు చంద్రరావు, రాజేష్, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

### కొత్త పింఛన్ల పంపిణీ


లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు

రేగిడి: మండలంలోని బూరాడ గ్రామంలో పలువురికి కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీడీవో శ్యామల కుమారి చేతులమీదుగా లబ్ధిదారులకు పెన్షన్ నగదు అందజేశారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు పింఛన్‌ను రూ.3 వేలకు పెంచారని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

### చురుగ్గా అభివృద్ధి పనులు


ఆదర్శనగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ వెంకట్

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు ఆదర్శనగర్‌లో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.5.8 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం చేపడుతున్నారు. శుక్రవారం ఈ పనులను మున్సిపల్ ఏఈ పి.వెంకట్ పరిశీలించి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు.

# ప్రజారోగ్యమే లక్ష్యం


బాడంగి: రామచంద్రాపురంలో ఆరోగ్య తనిఖీలకు క్యూలైన్‌లో ఉన్న రోగులు

ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గ్రామగ్రామాన ఏర్పాటైన వైద్యశిబిరాల్లో ఆరోగ్య తనిఖీలు చేయించుకునేందుకు ప్రజలు ఉత్సాహం కనబరుస్తున్నారు. శుక్రవారం శిబిరాలకు వచ్చిన వారికి వైద్యారోగ్య సిబ్బంది మెరుగైన సేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సకు పలువురిని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. ఊరూరా అందుబాటులోని ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలను కోరుతున్నారు. ఉన్న ఊరిలోనే ఉచితంగా వైద్యం అందుతుండడంతో ప్రజలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్.


రామభద్రపురం: బూసాయివలసలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రమామణి


రామభద్రపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో రోగులకు ఆరోగ్య తనిఖీలు


సంతకవిటి: వాల్తేరులో ఆరోగ్య తనిఖీలకు పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు


బొబ్బిలి: పక్కి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు


రాజాం సిటీ: గడిముడిదాంలో జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

# జీపీఎస్ ట్యాగింగ్ రద్దు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామారావు

బాడంగి: రైతుల ధాన్యం కొనుగోలులో జీపీఎస్ ట్యాగింగ్ రద్దు చేసి, పాత విధానమే పాటించాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది మాదిరి రైతులకు నచ్చిన వాహనాల ద్వారా రైస్‌మిల్లులకు ధాన్యం తరలించుకునే అవకాశం కల్పించాలన్నారు. జీపీఎస్ ట్యాగింగ్ కారణంగా వాహనాల కొరత ఏర్పడుతోందని, దీంతో ఇక్కడి నుంచి తెర్లాం మండలంలోని మిల్లులకు ధాన్యం తరలించేందుకు వాహనదారులు అదనంగా రవాణా చార్జీలు వసూలు చేస్తున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఏ మండలంలోని ధాన్యం అదే మండలంలోని మిల్లులకు తరలించేలా ట్రక్ షీట్లు ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు మండలంలో 8,429 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని ఏవో శిరీష తెలిపారు.

# సీఎం జగన్‌తోనే రాష్ట్రానికి మేలు


సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి, రాష్ట్రంలోని ప్రజలకు అన్నివిధాలా మేలు అని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని పొనుగుటివలస గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. ఓ వైపు ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99.5 శాతం హామీలు నెరవేర్చిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. సీఎం జగనన్న హయాంలో రాష్ట్రంలోని ప్రతీ వర్గంలోని ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఇదే వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి, మరోసారి జగనన్నను సీఎం చేయాలని కోరారు. అంతకుముందు గ్రామంలోని ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధి వివరాలు తెలిపే డిస్‌ప్లే బోర్డును ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు, కిల్లాన మోహన్, రెడ్డి శ్రీనివాసరావు, దూబ గోపాలం, మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


బొబ్బిలి: సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని పదో వార్డులో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు పాల్గొని, నాలుగున్నరేళ్లగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. అలాగే రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంత అవసరమో వివరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు దమ్మా అప్పచ్చి, మండల కన్వీనర్లు మండల జనార్ధనరావు, పెరుమాళి కూర్మారావు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు

బాడంగి: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని రామభద్రపురం, తెర్లాం, బాడంగి మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు మూడు రోజులుగా షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విధులకు హాజరుకాకుండా సమ్మెలో పాల్గొంటున్న 193 మెయిన్, 28 మినీ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని సిబ్బందికి షోకాజ్‌లు ఇస్తున్నామన్నారు. నోటీసులు తిరస్కరిస్తున్న వారి కేంద్రం, ఇంటి గోడలపై నోటీసులు అతికిస్తున్నామని, రిజిస్టర్ పోస్ట్ ద్వారా కూడా నోటీసులు పంపిస్తున్నామన్నారు. 2023 డిసెంబర్ 12వ తేదీ నుంచి ఈ నెల 10వ తేదీ వరకు విధులకు హాజరుకాకపోవడానికి గల కారణాలు తెలియజేయాలని, అలాగే ఈ నెల 19వ తేదీలోగా విధుల్లో చేరడం గానీ చేయాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిపారు. ఇదే విషయమై మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు పీవోతో చర్చించగా, అంగన్‌వాడీలపై తీసుకుంటున్న చర్యలను వివరించారు.

### అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: విజయవాడలో ఈ నెల 19వ తేదీన జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహ విష్కరణకు అందరూ తరలిరావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం సచివాలయాలకు వెళ్లి, ప్రతీ సచివాలయం నుంచి కనీసం ఏడుగురు చొప్పున ఆరోజు జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు. రూ.400 కోట్ల వ్యయంతో 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి, సీఎం జగనన్న అంబేడ్కర్ పట్ల ప్రత్యేకమైన అభిమానం చాటుకున్నారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిప్రదాత అయిన అంబేడ్కర్ వంటి మహనీయుడును గౌరవించుకునే అదృష్టం మనం పొందినందుకు ధన్యులమన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

# పారదర్శకంగా ధాన్యం కొనుగోలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు

- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాల నాయుడు

బొబ్బిలి: ప్రభుత్వం పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేపడుతుండడంతో రైతులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె శాఖల వారీగా అభివృద్ధి పనులపై అధికారులను ఆరాతీశారు. వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర రావు మాట్లాడుతూ మండలంలో 28 వేల టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ నెల 11వ తేదీ నాటికి 26,800 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఈ క్రమంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియతో పాటు వ్యవసాయ అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది పనితీరుపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయని ఎంపీపీ, ఏడీ అడగ్గా, ఏమీ లేవని సభ్యులు సమాధానమిచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న క్రాష్ ప్రోగ్రాం దృష్ట్యా పరికరాల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భరద్వాజ్ మాట్లాడుతూ గత నెల 29వ తేదీ నుంచి కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి సాయికృష్ణ మాట్లాడుతూ కొత్తగా రేషన్‌కార్డులు మంజూరైన వారికి ఫిబ్రవరి నెల నుంచి రేషన్ సరుకులు సరఫరా చేయనున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా, పక్కి, అలజంగి గ్రామాల్లో భూముల రీసర్వే జోరుగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, వైస్ ఎంపీపీ ఎ.శంకరరావు తదితరులు పాల్గొన్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో శనివారం నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరగదని, మళ్లీ ఈ నెల 18వ తేదీ నుంచి కొనుగోలు ప్రక్రియ పునఃప్రారంభమవుతుందని ఏడీ తెలిపారు.

# ఆట.. అదుర్స్..!


తెర్లాంలో ఆడుదాం ఆంధ్రా వాలీబాల్ పోటీలు

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ అందివ్వడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా పేరిట ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడాపోటీలు అద్భుతంగా జరుగుతున్నాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో శుక్రవారం జరిగిన మండల స్థాయి పోటీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని, యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. క్రీడలతోనే శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆటలో గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా పయనించాలన్నారు.

–సాక్షి నెట్‌వర్క్.


బాడంగి: గురుకుల పాఠశాల మైదానంలో ఖోఖో పోటీలు


తెర్లాం హైస్కూల్ గ్రౌండ్‌లో కబడ్డీ ఆట


రామభద్రపురం: మామిడివలసలో క్రికెట్ పోటీలకు సిద్ధమైన క్రీడాకారులు


రాజాం: ఒమ్మిలో కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు


రేగిడి: అంబఖండిలో కబడ్డీ పోటీలు

# ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద


రాజాం: వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో స్వామి వివేకానంద జయంతి శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నేతలంతా వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన గొప్పతనం కొనియాడారు. మనదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు వివేకానందుడని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని, ఉన్నతమైన జీవనం సాగించాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్


రాజాం సిటీ: వివేకానంద గొప్పతనం కొనియాడుతున్న కవి బాలసుధాకర్ మౌళి


వంగర: వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం


రామభద్రపురం: వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు


తెర్లాం: విజయరాంపురంలో వివేకానంద విగ్రహం వద్ద సర్పంచ్ మధుసూదనరావు, యువత


బొబ్బిలి: వివేకానందునికి క్షీరాభిషేకం చేస్తున్న యువత

### ఏరియా ఆస్పత్రికి కొత్త వస్తుసామగ్రి

రాజాం: స్థానిక ఏరియా ఆస్పత్రికి కొత్త వస్తుసామగ్రి శుక్రవారం వచ్చింది. ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆస్పత్రి అదనపు భవనాల నిర్మాణం జరుగుతుండగా, ఇప్పుడు కొత్తగా ఐరన్ మంచాలు, బెడ్‌లు, కుర్చీలు, పేషెంట్ రూమ్ టూల్‌కిట్‌లు ఆస్పత్రికి వచ్చి, చేరాయి. వీటిని కొత్తగా నిర్మిస్తున్న భవనాల్లో ఉంచుతామని ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు తెలిపారు.